క్లుప్తంగా

కైకరం విద్యార్థినికి స్టూడెంట్ సైంటిస్టు అవార్డు



స్టూడెంట్ సైంటిస్టు అవార్డు అందుకుంటున్న నెర్సు సుమలత

ఉంగుటూరు: కేవీ రావు సైంటిఫిక్ సొసైటీ ఆధ్వర్యంలో హైదరాబాదులో శనివారం నిర్వహించిన ప్రదర్శనలో ప్రతిభచూపి స్టూడెంట్ సైంటిస్టు అవార్డును కైకరం జెడ్పీ హైస్కూలుకు చెందిన నెరుసు సుమలత అందుకుంది. ఈ ప్రదర్శనలో ప్రథమస్థానంలో నిలిచిన సుమలతకు అవార్డు లభించింది. ప్రధానోపాధ్యాయులు గుళ్ల ప్రసాదరావుతోపాటు గైడుగా వ్యవహరించిన సైన్సు ఉపాధ్యాయుడు కూనాటి జాన్‌తో కలిసి సుమలత ఈ అవార్డు అందుకున్నారు. తాటి తోట సాగు ఒక నూతన వ్యవసాయ విధానం అనే ప్రాజెక్టును సుమలత తయారుచేసి ప్రదర్శించింది. డాక్టర్ ప్రియా అబ్రహం (సీనియర్ ప్రొఫెసర్, క్లినికల్ వైరాలజీ), పలువురు ప్రముఖుల చేతల మీదుగా ఈ అవార్డును అందుకున్నట్టు ప్రసాదరావు తెలిపారు.

చర్చి నిర్మాణానికి ఆర్థిక సాయం

దెందులూరు: తెనాలి సాల్వేషన్ ఆర్మీ డివిజనల్ కమాండర్ వి.ఏసుపాదం, శాంతకుమారి దంపతులు శనివారం రూ. 30 వేలు నగదును దెందులూరు కోర్ ఆఫీసర్ మేజర్ కాకి రమణయ్యకు అందజేశారు. దెందులూరులో సాల్వేషన్ ఆర్మీ నూతన చర్చి నిర్మిస్తున్న నేపథ్యంలో తెనాలి నుంచి వచ్చి తమ వంతు బాధ్యతగా రూ. 30 వేలు చర్చి నిర్మాణానికి అందించినట్టు మేజర్ శాంతకుమారి అన్నారు. దెందులూరు కోర్ ఆఫీసర్ చర్చి నిర్మాణానికి రూ. 30 వేలు ఇచ్చిన డివిజనల్ కమాండర్ దంపతులను అభినందించారు. దెందులూరుకు చెందిన దేవదాసి శాంతకుమారి, డీడీడబ్ల్యూఎం హోదాలో ఆమె భర్త ఏసుపాదం డివిజనల్ కమాండర్ హోదాలో దెందులూరు చర్చికి వచ్చిన నేపథ్యంలో కోర్ ఆఫీసర్ సంఘ సభ్యులు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ కల్నల్ జోషియా, సంఘ పెద్దలు సొంగా కిరణ్ తదితరులున్నారు.

దస్తావేజు లేఖరుల సమస్యలు పరిష్కరించాలి

దెందులూరు: సమస్యలు పరిష్కరించాలని దస్తావేజు లేఖరులు డిమాండ్ చేశారు. దస్తావేజు లేఖరులకు లైసెన్సులు ఇవ్వాలని, జీవో 2లో అంశాలను మార్పు చేయాలని శనివారం నిర్వహించిన రాష్ట్ర సమావేశంలో తీర్మానించినట్టు ఏపీ రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పెనుమాక వెంకట సుబ్బారావు అన్నారు. శనివారం వీరమాచినేని వెంకట నారాయణ భవనంలో నిర్వహించిన సమావేశంలో దస్తావేజు లేఖరులు పాల్గొన్నారు. సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు సుబ్బారావు మాట్లాడుతూ సంఘం బలోపేతం, సభ్యత్వ నమోదు, సమస్యల పరిష్కారం అంశాలపై రెవెన్యూ శాఖ స్టాంప్స్ అండ్ రిజిస్ట్రేషన్ శాఖ మంత్రి, ముఖ్యమంత్రిని కలిసి వినతి పత్రం అందజేయాలని తీర్మానించామన్నారు. సమావేశంలో జనరల్ సెక్రటరీ దాసరి సుధాకర్, కోశాధికారి సత్యనారాయణ, నాయకులు సుబ్బారావు, ప్రసాద్, రామకృష్ణ, నాగభూషణం, ఏలూరు జిల్లా అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

ఆయుర్వేదంలో దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స



ఆయుర్వేద మందులు పంపిణీ చేస్తున్న వేణుబాబు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఆయుర్వేద వైద్య విధానంలో అనేక దీర్ఘకాలిక వ్యాధులకు చికిత్స ఉందని ప్రముఖ ఆయుర్వేద వైద్యుడు బీబీఎం నగేష్ అన్నారు. ఏలూరు లయన్స్ క్లబ్ జిల్లా అధ్యక్షుడు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో శనివారం స్థానిక పేరయ్య కోనేరు ప్రాంగణంలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం నిర్వహించారు. 88 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లయన్స్ జిల్లా గవర్నర్ కాకరాల వేణుబాబు, క్లబ్ సభ్యులు బొలిశెట్టి సురేష్ కుమార్, పరస శ్రీనివాస్, చెన్నా వెంకట్రామయ్య, పిల్లి పండరీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

సెలవు దినాల్లో తరగతులను అడ్డుకున్న నాయకులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): సెలవు దినాల్లో తరగతులు నిర్వహిస్తున్న శశి, ఆదిత్య విద్యా సంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. నగరంలో రెండో శనివారం క్లాసులు నిర్వహిస్తోన్న పలు ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థల వద్దకు పీడీఎస్‌యూ నాయకులు వెళ్లి అడ్డుకొని విద్యార్థులను ఇంటికి పంపారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు కాకి నాని మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు నిబంధనలు పాటించడం లేదని అన్నారు. శశి క్యాంపస్‌లో ఇంటర్మీడియట్ క్లాస్ నిర్వహిస్తున్నారని ఆర్‌ఐఓకు ఎన్నిసార్లు ఫోన్ చేసినప్పటికీ స్పందించలేదని నాని తెలిపారు.

హడలెత్తిస్తున్న అతిసారం

- భయాందోళనలో ప్రజలు
- కలుషిత నీరు, ఆహారం వల్లే అనారోగ్య సమస్యలు
- జాడ లేని ఫుడ్ సెఫ్టీ శాఖ అధికారులు
- తనిఖీలపై నిర్లక్ష్యం



భీమడోలు సీహెచ్‌సీలో రోగులను పరామర్శిస్తున్న వైద్యాధికారి కె.శ్రీలక్ష్మి



భీమడోలు విలేజ్ క్లినిక్ సిబ్బందికి సూచనలందిస్తున్న వైద్యాధికారి



ఇంటింటికీ వెళ్లి ప్రజలకు ముందస్తు జాగ్రత్తలు వివరిస్తున్న వైద్య ఆరోగ్య శాఖ సిబ్బంది



వాటర్ ట్యాంకులో క్లోరినేషన్ చేస్తున్న దృశ్యం



భీమడోలులోని వృద్ధురాలిని పరామర్శిస్తున్న సిబ్బంది

భీమడోలు: డయేరియా (అతిసారం) దడ పుట్టిస్తోంది. వివిధ ప్రాంతాల్లో రోజు రోజుకూ చాపకింద నీరులా విస్తరించడంతో జనం వణికిపోతున్నారు. భీమడోలు సామాజిక ఆరోగ్య కేంద్రం, గుండుగొలను, పూళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో భీమడోలు, పెదలింగంపాడు, ఆర్జావారిగూడెం, పోలసానిపల్లి, బుట్టాయిగూడెంలోని పలువురు విరేచనాలతో బాధపడుతూ వైద్య సేవలను అందుకుని డిశ్చార్జి అయ్యారు. పూళ్లలో పొరుగు గ్రామాల నుంచి బంధువుల ఇంటికి వచ్చిన ఇద్దరు విరేచనాలతో బాధపడుతూ ఒకటి, రెండు రోజుల పాటు వైద్య సహాయం పొందారు. ఎక్కువగా తినే ఆహారం కలుషితమవ్వడం వల్లే విరేచనాల బారిన పడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. ప్రజలు మాత్రం డయేరియా లక్షణాలతో ఆసుపత్రుల చుట్టూ పరుగులు తీస్తున్నారు. కొన్ని రోజుల వ్యవధిలోనే మహిళలు, వృద్ధులు, పిల్లలు డయేరియా లక్షణాలతో బాధపడటం కలకలం రేపింది. వర్షాలు కురవడంతో ఏర్పడిన వాతావరణం వ్యాధి వ్యాప్తికి మరింత దోహదం చేస్తోంది. దీనిపై సకాలంలో మేల్కొనకపోతే ప్రాణాంతకంగా మారే ప్రమాదం ఉంటుందని వైద్యులు స్పష్టం చేస్తున్నారు. ప్రధానంగా చిన్నారులు ఉన్న తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. డయేరియాతో పాటు సీజనల్ వ్యాధుల సంక్రమణపై వైద్య ఆరోగ్య శాఖ, ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ అధికారులు గ్రామీణ ప్రాంతాల్లో విస్తృతంగా ప్రచారం చేయాల్సి ఉన్నా ప్రస్తుతం తూతూమంత్రంగానే ఈ కార్యక్రమాలు సాగుతున్నాయి. ముందస్తు చర్యలపై అధికారులు దృష్టి సారించడం లేదని ప్రజలు వాపోతున్నారు. డయేరియా లక్షణాలతో ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో చేరే వారి సంఖ్య నానాటికీ పెరుగుతోంది.

పారిశుద్ధ్య నిర్వహణపై నిర్లక్ష్యం

జిల్లా వ్యాప్తంగా పారిశుద్ధ్యం పడకేసింది. మంచినీటి పథకాల ద్వారా సరఫరా చేసే తాగునీరు కలుషితమవుతోందని, కాలం చెల్లించిన పైపులైన్లను ఇప్పటికీ వినియోగిస్తున్నారు. డ్రెయినేజీలకు ఆనుకుని పైప్‌లైన్లు ఉండడంతో నీటి కాలుష్యానికి కారణమవుతోంది. పల్లెల్లో బోర్లు, బావుల నీటినే ఇప్పటికే వినియోగిస్తున్నారు. ఆ నీటిని నేరుగా తాగడం వల్ల డయేరియా బారిన పడుతున్నారు. కల్తీ ఆహారం తినడం, అపరిశుభ్ర పరిసరాలు, జీవన విధానంలో లోపాలు డయేరియా వ్యాప్తికి ప్రధాన కారణమవుతోంది.

మౌనం వహిస్తున్న ఫుడ్ సెఫ్టీ అధికారులు?

వర్షాలు ప్రారంభమవగానే డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి ప్రాణాంత వ్యాధులు ప్రబలుతాయి. వీటి బారిన పడి అనేక మంది ఆసుపత్రుల పాలై ఆరోగ్యపరంగా, ఆర్థిక పరంగా అవస్థలు పడుతున్నారు. జూన్ నుంచి సెప్టెంబర్ వరకు సీజనల్ వ్యాధులు వృద్ధి చెందే అవకాశాలు ఉంటాయని వైద్యులు చెబుతున్నారు. గ్రామాల్లో విస్తరించిన హోటళ్లు, రెస్టారెంట్లు, కర్రీ పాయింట్ల వద్ద ఎక్కువగా ఆహారం కలుషితమవుతుంది. టిఫిన్ సెంటర్లు, భోజన దుకాణాల వద్ద పరిశుభ్రత లోపిస్తుంది. నిల్వ ఉన్న ఆహార పదార్థాలను తర్వాత రోజు కూడా వినియోగిస్తున్నారు. వీధి దుకాణాల వద్ద టిఫిన్లు, హోటళ్ల బిర్యానీలు తిన్న వారే ఎక్కువగా డయేరియా లక్షణాలతో బాధపడుతున్నారని వైద్యులు చెబుతున్నారు. ఎప్పటికప్పుడు ఆహార పదార్థాల తనిఖీలు చేయాల్సిన ఫుడ్ సెఫ్టీ అధికారులు తమకు పట్టనట్లుగా మౌనం వ్యవహరిస్తున్నారు.

నీరు, ఆహారం విషయంలో శ్రద్ధ వహించాలి



మండలం పరిధిలో డయేరియా కేసులు నమోదు కాలేదు. ఎటువంటి ఆందోళన చెందనవసరం లేదు. రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్న వారు తినే ఆహార పదార్థాలు జీర్ణించుకునే శక్తి లేక విరేచనల బారిన పడుతున్నారు. అలాంటి వారు ఆసుపత్రుల్లో చేరితే వారిపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నాం. నీరు, ఆహారం విషయంలో ప్రజలు శ్రద్ధ వహించాలి. ఒకే ఇంటిలో ఎక్కువ మంది డయేరియా బారిన పడితే వ్యాధి వ్యాప్తించినట్టు గుర్తిస్తాం. అలాంటి కేసులేమీ నమోదు కాలేదు. వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కలిస్తున్నాం.

– కె.శ్రీలక్ష్మి, వైద్యాధికారి, గుండుగొలను

అప్రమత్తతతోనే వ్యాధులకు దూరం



వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి అవకాశాలెక్కువ. ప్రతి ఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలి. వాటిపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలి. ప్రజలు మరీ ముఖ్యంగా తాగునీరు, తినే ఆహార పదార్థాలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. కాచి చల్లార్చిన నీటిని, వేడి ఆహార పదార్థాలను తీసుకోవాలి. నిల్వ ఉన్న ఆహార పదార్థాలు, బయటి ఆహారాన్ని తినవద్దు. బయట ఆహార పదార్థాలు తినడం వల్లే కొంత మంది విరోచనాల బారిన పడి ఆసుపత్రుల్లో చేరుతున్నారు.

– డాక్టర్ సునీత, ఆసుపత్రి సూపరింటెండెంట్, సీహెచ్‌సీ, భీమడోలు

రైతులు అప్రమత్తంగా ఉండాలి

దెందులూరు: వారం రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా కురుస్తున్న భారీ వర్షాలకు తడిసిన విద్యుత్ స్తంభాలు, తీగలను రైతులు తాకవద్దని విద్యుత్ శాఖ ఏడీఈ త్రివాస్ సూచించారు. శనివారం దెందులూరులో ఆయన మాట్లాడుతూ వర్షం కురిసిన ప్పుడు పొలాల్లోని విద్యుత్ మోటార్లను ఆన్ చేయవద్దని రైతులకు సూచించారు. విద్యుత్ స్తంభాలు పొలాల్లో ఒరిగిపోయే పరిస్థితి ఉంటే తక్షణమే ఆయా మండలాల్లో పనిచేస్తున్న విద్యుత్ శాఖాధికారులకు సమాచారం అందించాలన్నారు. విద్యుత్ తీగలు, మోటార్లు తెగి ఉంటే వాటిని ముట్టుకోకుండా తగు జాగ్రత్తలు పాటించి ప్రమాదాలకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. పూర్తి అప్రమత్తతతో రైతులు, కూలీలు జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

అండర్‌పాస్ సమస్య పరిష్కారానికి కృషి



దెందులూరు- అలుగులగూడెం అండర్‌పాస్‌కు రక్షణ లేని దృశ్యం

దెందులూరు: దెందులూరు– అలుగులగూడెం రైల్వే గేటు వద్ద ఇటీవల నిర్మించిన అండర్‌పాస్‌కు పైభాగంలో రక్షణ చర్యలు చేపట్టకపోవడంతో రెండువైపులా వర్షపు నీరు చేరి రాకపోకలకు తలెత్తిన సమస్యకు శాశ్వత పరిష్కారానికి కృషి చేస్తానని రైల్వే జోనల్ మెంబర్ గుమ్మడి చైతన్య కృష్ణ అన్నారు. శనివారం అండర్‌పాస్ నిర్మాణం రక్షణ లేని పైభాగాన్ని, వర్షం వచ్చిన ప్రతిసారి రెండువైపులా చేరుతున్న నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయవాడ, సికింద్రాబాద్ రైల్వే ఉన్నతాధికారులను కలిసి వెంటనే అండర్‌పాస్ పైభాగాన రెండువైపులా రక్షణ చర్యలు ఏర్పాటు చేసేలా మాట్లాడతానన్నారు. రక్షణ చర్యలు చేయనంత వరకు వర్షం కురిసిన ప్రతిసారి వర్షపు నీరు చేరి రాకపోకలకు అంతరాయం ఏర్పడుతుందని, ఇది ప్రయాణికులకు చాలా ఇబ్బందికర సమస్య అని ఆయన అన్నారు.

ట్రిపుల్ ఐటీకి ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ఎంపిక



జస్వంత్ కార్తీక్





బల్లారపు సుజన్ ఇవాంజలిన్ ఎం సాంబశివరావు

ఉంగుటూరు: ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించి పదో తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన పలువురు విద్యార్థులు ట్రిపుల్ ఐటీ కళాశాలల్లో ప్రవేశానికి ఎంపికయ్యారు. కైకరం జిల్లా పరిషత్ హైస్కూల్లో పదవ తరగతి చదివిన పొడుగు జస్వంత్ కార్తీక్ ఒంగోలు ట్రిపుల్ ఐటీకి ఎంపికయ్యాడు. ప్రధానోపాధ్యాయుడు గుళ్ల ప్రసాదరావు తదితరులు కార్తీక్‌ను అభినందించారు.

ట్రిపుల్ ఐటీకి ఇద్దరు విద్యార్థుల ఎంపిక

పెదపాడు: అప్పనవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ట్రిపుల్ ఐటీలో సీట్లు సాధించారు. అప్పనవీడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బల్లారపు సుజన్ ఇవాంజలిన్, సాంబశివరావు పదవ తరగతిలో అత్యుత్తమ ప్రతిభ కనపచడంతో వారికి ప్రభుత్వం ట్రిపుల్ ఐటీ సీట్లు కేటాయించింది. మానవత రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరావు, ప్రధానోపాధ్యాయిని తోట పుష్పావతి, ఎంఈఓలు సబ్బితి నర్సింహమూర్తి, డీవీ రమణ విద్యార్థులను అభినందించారు.

నైతిక జీవన సూత్రాలు తెలిపేవి పద్యాలే



హిందీ పద్య పఠన పోటీల్లో బహుమతులు అందుకున్న విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): పిల్లలకు నైతిక జీవన సూత్రాలు తెలిపేవి పద్యాలేనని, ధారణ శక్తి వృద్ధికి, భాషా సౌందర్యం తెలుసుకోవడానికి, ఆత్మ విశ్వాసం కోల్పోతున్న అనేక సందర్భాల్లో ఆత్మవిశ్వాస బీజాల్ని నాటి, వాటిని మహావృక్షాలుగా పెంచేవి పద్యాలని, ప్రతి విద్యార్థీ పద్య పఠనం నిరంతరం చేయాలని హిందీ నికేతన్ అధ్యక్షుడు వి.వెంకటస్వామి అన్నారు. స్థానిక పవర్‌పేటలోని హిందీ నికేతన్ వజ్రోత్సవాల్లో భాగంగా శనివారం హిందీ పద్య పఠన పోటీలు నిర్వహించారు. వెంకటస్వామి మాట్లాడుతూ నేడు పిల్లలకు పద్యం ప్రాముఖ్యత తెలియడం లేదని, పద్యం యొక్క అవసరాన్ని, ప్రాముఖ్యతను తెలియజేయడానికి హిందీ పద్య పఠన పోటీలు నిర్వహించామని తెలిపారు. కార్యక్రమానికి న్యాయ నిర్ణేతగా వ్యవహరించిన హిందీ పండిట్ ట్రైనింగ్ కళాశాల లెక్చరర్ పీఎం మోహన్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులలో పద్య పఠనం వల్ల వ్యక్తిత్వ వికాసం, ఆత్మ చైతన్యం, సాహితీ విలువలతో కూడిన జీవితం అలవడుతుందని అన్నారు. హిందీ నికేతన్ కార్యదర్శి పి.కవితా కుమారి మాట్లాడుతూ హిందీ నికేతన్ వజ్రోత్సవాల సందర్భంగా సంవత్సరమంతా వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తామని, విద్యార్థులు జాతీయ భాష హిందీ పట్ల ఆసక్తి చూపించి భాషను అభ్యసిస్తే భారతదేశంలోని ఏ ప్రాంతానికి వెళ్లినా భాషా సమస్యలు ఉండవని, ఈ పోటీ కార్యక్రమాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ పోటీల్లో మొత్తం 66 మంది విద్యార్థులు పాల్గొనగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులను వరుసగా ఎస్ ప్రతిమ, ఎస్ నందకిషోర్, సీహెచ్ రేవంత్ పొందగా ఎస్ శ్రీ సౌమ్య, ఆర్ ధనరాజ్ ప్రోత్సాహక బహుమతులు పొందారు. కార్యక్రమంలో హిందీ పండితులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

శాంతినగర్‌లో కొబ్బరి పీచు పరిశ్రమ ఏర్పాటుకు చర్యలు



కొబ్బరి పీచు తయారీ యంత్రం (ఫైల్)

ఏలూరు టౌన్: ఏలూరు నగరపాలక సంస్థకు ఆదాయాన్ని సమకూర్చేందుకు అధికారులు ప్రత్యేక కార్యాచరణతో పనిచేస్తున్నారు. గతంలోనే ఆదాయ కల్పనకు బీజం పడినా.. ప్రస్తుతం ఆచరణలోకి తీసుకువచ్చేందుకు చర్యలు చేపట్టారు. వ్యర్థాలను సక్రమంగా వినియోగిస్తూ కార్పొరేషన్‌కు ఆదాయాన్ని సమకూర్చేలా చిన్న తరహా పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారు. నగరంలో అనేక ప్రాంతాల్లో కొబ్బరి బొండాల విక్రయాలు జోరుగా సాగుతుంటాయి. తాగేసిన కొబ్బరి బొండాలను రోడ్లపైనా, కాలువల్లోనూ, డ్రెయినేజీల్లోనూ పడేస్తూ ఉంటారు. ఇవి వర్షాకాలంలో దోమలకు ఆవాసాలుగా మారుతుంటాయి. వర్షపు నీరు కొబ్బరి బొండాల్లో నిల్వ ఉండిపోవటంతో డెంగీ, మలేరియా కారక దోమలు విపరీతంగా పెరిగిపోతుంటాయి. ఇలాంటి పరిస్థితుల్లో ప్రజలు అనారోగ్యం బారిన పడుతుంటారు.

త్వరలో నిర్మాణ పనులు

ఏలూరు నగరంలో ప్రతి రోజూ సుమారు మూడు వేల నుంచి నాలుగు వేలు వరకు కొబ్బరి బొండాలు విక్రయిస్తుంటారు. ఈ కొబ్బరి డొక్కలతో పీచు, కోకోపిట్ తయారు చేసేందుకు పరిశ్రమను ఏర్పాటు చేస్తున్నారు. ప్రస్తుతం కోకోపిట్‌ను ప్లాంటేషన్‌లో విరివిగా వినియోగిస్తుండగా, కొబ్బరి పీచును సోఫాల తయారీ పరిశ్రమలో వినియోగిస్తారు. ఏలూరు శాంతినగర్‌లోని కార్పొరేషన్ స్థలంలో ఈ పరిశ్రమను ఏర్పాటుకు చర్యలు చేపట్టారు. ఇప్పటికే టెండర్ ప్రక్రియ పూర్తి చేయగా, త్వరలోనే నిర్మాణ పనులు పూర్తి చేసేందుకు నిర్ణయించామని ఏలూరు నగర కమిషనర్ సంక్రాంతి వెంకటకృష్ణ తెలిపారు. చిన్న పరిశ్రమ ఏర్పాటుతో కార్పొరేషన్‌కు ఆదాయం, దోమల నివారణ, పర్యావరణ హితంగా ఉంటుందని చెప్పారు.

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం



పిప్పరలో గర్భిణులు, బాలింతలకు అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

గణపవరం: బాలింతలు, గర్భిణులు ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని తప్పక తీసుకోవాలని పిప్పర పీహెచ్‌సీ వైద్యాధికారి కె.ప్రియాంక అన్నారు. శనివారం గణపవరం మండలం పిప్పర పీహెచ్‌సీలో గర్భిణులు, బాలింతలకు ఐసీడీఎస్, పీహెచ్‌సీ ఆధ్వర్యంలో నిర్వహించిన ఆరోగ్య అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ గర్భిణులు ప్రతి నెలా పీహెచ్‌సీలో తప్పకుండా పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఐరన్ మాత్రలు వేసుకోవాలని, అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారం తీసుకోవాలని, ఆకుకూరలు ఎక్కువగా తినాలని సూచించారు. బాలింతలకు ఆరోగ్యపరమైన సూచనలు ఇచ్చారు. ఈకార్యక్రమంలో ఎంపీహెచ్ఈవో వెంకటేశ్వర్లు, పిప్పర సెక్టార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ దుర్గాభవాని, ఆరోగ్య సహాయకుడు నామాలరాజు వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ఎడతెరిపి లేకుండా భారీ వర్షం

ఉంగుటూరు: ఎడతెరిపి లేకుండా భారీ వర్షం రెండు రోజులుగా కురుస్తోంది. శుక్రవారం మధ్యాహ్నం నుంచి విడవకుండా రాత్రి, శనివారం రోజంతా వర్షం కురుస్తూనే ఉంది. శుక్రవారం 12.0 మిల్లీమీటర్ల వర్ష పాతం నమోదైంది. ఈ వర్షం మెట్ట ప్రాంతంలో బోరులేని చిన్న సన్నకారు రైతులకు ఉపయోగపడుతుంది. నాట్లు, దమ్ములు ముమ్మరంగా సాగేందుకు ఈ భారీ వర్షం దోహదపడుతుందని రైతులు అన్నారు. నాచుగుంట, యర్రమళ్ల, గుళ్లపాడు, వెల్లమిల్లి, నీలాద్రిపురం, గొల్లగూడెం, నల్లమాడు, గోపాలపురం గోకవరం, తిమ్మయ్యపాలెం, యర్రమిల్లిపాడులో వ్యవసాయ పనులు ముమ్మరం ప్రారంభమయ్యాయి.

చదువులో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలి



పెదవేగి హాస్టల్లో భోజనం తయారీని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్

పెదపాడు: విద్యార్థులు చదువులో రాణించి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తెలిపారు. పెదపాడు మండలంలోని వట్లూరు గురుకుల పాఠశాలను ఎమ్మెల్యే చింతమనేని శనివారం ఆకస్మికంగా సందర్శించారు. ఈకార్యక్రమంలో పాఠశాలలోని సౌకర్యాలను పరిశీలించి విద్యార్థుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రిన్సిపాల్ దాసరి మేరి ఝాన్సీరాణి పాల్గొన్నారు. అనంతరం ఆయన అభయాంజనేయస్వామిని దర్శించుకున్నారు.

సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో తనిఖీ

దెందులూరు: హాస్టల్ విద్యార్థులను అక్కడి సిబ్బంది సొంత బిడ్డలతో సమానంగా చూడాలని ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అన్నారు. పెదవేగి సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలను శనివారం ఆయన ఆకస్మికంగా సందర్శించారు. వంటశాల, గ్రౌండ్, మరుగుదొడ్లు పరిశీలించి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని సూచించారు. ఏపీఈడబ్ల్యూఐడీసీ డివిజనల్ ఇంజనీర్ కోటేశ్వరరావు, డీసీఓ భారతి, ప్రిన్సిపల్ వెంకటేశ్వరరావు, టీడీపీ మండల అధ్యక్షుడు బొప్పన సుధాకర్, సర్పంచ్ మేకా కనకరాజు ఉన్నారు.

జెడ్పీ ఛైర్‌పర్సన్‌కు ప్రజాప్రతినిధుల ఘన సత్కారం



జెడ్పీ ఛైర్మన్ ఘంటాపద్మశ్రీకి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

పెదపాడు/దెందులూరు/ఉంగుటూరు: ఉమ్మడి జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ పుట్టిన రోజు వేడుకలు శనివారం ఏలూరులోని జెడ్పీ భవనంలో ఘనంగా నిర్వహించారు. జిల్లాలోని పలువురు నాయకులు, అధికారులతో పాటు మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్‌లు, జిల్లా పరిషత్ ఉద్యోగులు, అధికారులు పాల్గొని జెడ్పీ ఛైర్‌పర్సన్‌ను ఘనంగా సత్కరించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసీ ఛైర్మన్ మేకా లక్ష్మణరావు, జెడ్పీటీసీ సభ్యులు నిట్టా లీలానవకాంతం, కొరిపల్లి జయలక్ష్మి, తుమ్మగంటభవాని, పెదపాడు మండల ఉపాధ్యక్షురాలు రెడ్డి స్వర్ణకుమారి, పెదపాడు సొసైటీ త్రీమెన్ కమిటీ మాజీ ఛైర్మన్ అక్కినేని రాజశేఖర్, రాజుపేట సర్పంచ్ తొండురు క్రాంతికుమార్, కలపర్రు సర్పంచ్ వట్రపు విష్ణుతులసి, నాయకులు విజయ్‌కుమార్, కోట గోవర్ధన్, బెజవాడ శేఖర్,ఏఎంసీ మాజీ ఛైర్మన్ మరడ రమావతి మంగరావు, కనకదుర్గమ్మ ఆలయ ట్రస్టు బోర్డు మాజీ డైరెక్టర్ తొత్తడి వేదకుమారి, నాయకులు తొత్తడి కృష్ణ, పార్టీ జిల్లా కార్యదర్శులు కట్టా ఏసుబాబు, చల్లా మేరిరాజు పాల్గొన్నారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య కార్యక్రమాలు



వాకపల్లిలో కచ్చాడ్రెయిన్ తవ్వుతున్న దృశ్యం



సీసీ డ్రెయిన్‌లో పూడిక తొలగిస్తున్న దృశ్యం

గణపవరం: వాతావరణ మార్పులతో గ్రామాల్లో పారిశుద్ధ్య సమస్య తీవ్రరూపం దాలుస్తోంది. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో పరిస్థితి మరింత దిగజారుతోంది. కచ్చా డ్రెయిన్లు లేక మురుగునీరు రోడ్లపై ప్రవహిస్తోంది. మురుగునీటి నిల్వల కారణంగా దోమలు వృద్ధి చెంది ప్రజల కంటిపై కునుకు లేకుండా చేస్తున్నాయి. దీనితో గ్రామ పంచాయతీలు పారిశుద్ధ్య సమస్యపై దృష్టి సారించాయి. మండలంలోని పలు గ్రామాల్లో అధికారులు తాత్కాలికంగా కచ్చా డ్రెయిన్లు ఏర్పాటు చేస్తున్నారు. సీసీ డ్రెయిన్లలో పూడిక తీత కార్యక్రమాలు ముమ్మరంగా సాగుతున్నాయి. డ్రెయిన్లలో నిండిపోయిన ప్లాస్టిక్ వ్యర్థాలను కార్మికులు తొలగిస్తున్నారు. డ్రెయిన్లు, రోడ్లకు ఇరువైపులా బ్లీచింగ్ చల్లిస్తున్నారు. మండలంలోని గణపవరం, జల్లికాకినాడ, కొందేపాడు, మొయ్యేరు, సరిపల్లె, జల్లికొమ్మర తదితర గ్రామాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మండల అధికారులు పర్యవేక్షిస్తున్నారు.